

ఫలం.. పోషకాలు పుష్కలం 10లో▸
రంజాన్ మాసం వచ్చిందంటే పండ్లకు భలే గిరాకీ. ఇఫ్తార్ దీక్ష విరమణకు ముస్లింలు ఎక్కువగా వీటినే ఇష్టపడుతారు. కారణం ఇందులో పోషకాలు అధికంగా ఉండడమే.

ఏప్రిల్ 3 నుంచి టెన్త్ పరీక్షలు

కైలాస్‌నగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 12 వరకు కొనసాగనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. సామాన్యశాస్త్రం పరీక్షకు మాత్రం 20 నిమిషాల సమయం అదనంగా ఉంటుందని పేర్కొన్నారు. పార్ట్–1 ఫిజికల్ సైన్స్ ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు, పార్ట్–2 బయోజికల్ సైన్స్ ఉదయం 11.20 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు విషయాన్ని గమనించి హాజరుకావాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
39.0/23.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు : 6:29	శుక్ర 4:49

న్యూస్‌రీల్

ముగిసిన ఇంటర్ పరీక్షలు



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు చివరి రోజు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు కొనసాగాయి. జనరల్ విద్యార్థులు 7,944 మందికి గాను 422 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 779 మందికి గాను 643 హాజరు కాగా 136 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. హాస్టల్ విద్యార్థులు ఇంటిబాట పట్టారు. దీంతో బస్టాండ్ ప్రాంతం రద్దీగా మారింది.

మెడికల్ ఆఫీసర్ల ప్రొవిజినల్ జాబితా

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ హెల్త్ మిషన్‌లో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భర్తీ చేయనున్న మెడికల్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించిన ప్రొవిజనల్ జాబితా విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాను కార్యాలయ నోటీసు బోర్డు, అధికారిక వెబ్‌సైట్ http:// adilabad. telangana. gov. in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వివరాలను సరిచూసుకుని ఏమైనా పొరపాట్లు ఉన్నట్లైతే ఏప్రిల్ 1నుంచి 3వ తేదీ వరకు నేరుగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఆయా తేదీలలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు సంబంధిత సర్టిఫికెట్లు సమర్పించి సరిచేసుకోవాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: జిల్లా మహిళా సాధికారత కేంద్రంలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి మిల్కా ప్రకటనలో తెలిపారు. జిల్లా మిషన్ కోఆర్డినేటర్-(01), జెండర్ స్పెషలిస్ట్-(02), స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ (01), ఎంటీఎస్- (01) పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత వివరాలను adilabad. telangana. gov. in, adilabad. nic. in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఏప్రిల్ 11లోగా జిల్లా కేంద్రంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

టీబీ నియంత్రణకు కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో టీబీ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీఎంఆర్ నోడల్ అధికారి జి.సుభాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి ఆవరణలో గల టీబీ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. రోగుల వివరాలు, నమోదవుతున్న కేసులపై ఆరా తీశారు. వ్యాధి లక్షణాలు కలిగిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని సూచించారు. క్రమం తప్పకుండా మందులు వాడటం ద్వారా టీబీ నయమవుతుందన్నారు. వైద్య సిబ్బంది రోగుల స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణాధికారి శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీఆర్పీల శిక్షణ



ఆదిలాబాద్‌టౌన్: విద్యా ప్రమాణాల పెంపులో సీఆర్పీల పాత్ర కీలకమని జిల్లా సెక్టోరియల్ అధికారి నర్సయ్య అన్నారు. రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని సమగ్ర శిక్ష సీఆర్పీలకు రీడ్ కార్యక్రమంపై ఈ నెల 28, 29 తేదీల్లో స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రీడ్ కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థికి చేరేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో స్టేట్ కోఆర్డినేటర్ రాంబాబు, ఫీల్డ్ కోఆర్డినేటర్ గీత, సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోవాలె

బోథ్ మండలంలో ఇటీవల కురిసిన వడగళ్లకు నేలవాలిన మొక్కజొన్న



- అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- నష్టంపై జిల్లాలో కొనసాగుతున్న సర్వే
- '33 శాతం' నిబంధనపై రైతుల్లో ఆందోళన
- బాధితులందరికీ పరిహారం అందించాలని వేడుకోలు

బోథ్: జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న, జొన్న, గోధుమ, మిర్చి, మామిడి, నువ్వు పంటలు దెబ్బతిన్నాయి. సుమారు 3వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఈ మేరకు సీఎం కేసీఆర్ ఇటీవల పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల పరిహారం ప్రకటించడంతో జిల్లాలో వ్యవసాయ అధికారులు సర్వే ప్రారంభించారు. బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ మండలాల్లో పంట నష్టం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ఆయా మండలాల్లో పంట నష్టం వివరాలను అధికారులు నమోదు చేస్తున్నారు. అయితే పరిహారం విషయంలో ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధన రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

33 శాతం దెబ్బతింటేనే..
పరిహారం విషయంలో ప్రభుత్వం నిబంధన విధించింది. పంట 33 శాతం దెబ్బతింటేనే పరిహారం అందనుందని ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో నిబంధన మేరకు దెబ్బతిన్న పంటల వివరాలు మాత్రమే సేకరిస్తున్నారు. దీంతో నిర్దేశిత మార్కు దాటని పంట నష్టపోయిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నిబంధన తొలగించి పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలని వేడుకుంటున్నారు.

కౌలు రైతులకు సైతం పరిహారం..
పంట నష్ట పోయిన కౌలు రైతులకు సైతం పరిహారం అందిస్తామని సీఎం ప్రకటించారు. ఇందుకోసం సర్వేలో కౌలు రైతులకు సంబంధించిన కాలమ్‌ను ఏర్పాటు చేశారు. కౌలు గుర్తింపు కార్డులు కలిగిన రైతులు, నోటిమాట ద్వారా కౌలుకు తీసుకున్న రైతుల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేస్తున్నారు. ఈ సారి వీరికి కూడా పరిహారం వచ్చే అవకాశం ఉంది.

ప్రభుత్వానికి నివేదిస్తాం..
బోథ్: ఇటీవల కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల సర్వేను త్వరగా పూర్తిచేసి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య తెలిపారు. బోథ్ మండల కేంద్రంలో దెబ్బతిన్న పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ఆయా క్లస్టర్లలో ఇప్పటికే సర్వే చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు అందుబాటులో ఉండి వివరాలు అందించాలన్నారు. ఆయన వెంట వ్యవసాధికారి విశ్వామిత్ర, ఏఈవో కృష్ణ ఉన్నా రు.

నేరడిగొండలో..
నేరడిగొండ: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను రైతులు సర్వేలో నమోదు చేయించాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. మండలంలో ఇటీవల కురిసిన వడగళ్ల వానకు దెబ్బతిన్న జొన్న, మొక్కజొన్న పంటల సర్వేను ఏవో భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. గాజిలి, రాయ్‌పూర్, తర్నం(కె) గ్రామాల్లో చేపడుతున్న సర్వేలో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పంట నష్టం వివరాలను రైతులు దగ్గరుండి అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. వారి వెంట సర్పంచులు రాజు యాదవ్, విశాల్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు భీమ్ రెడ్డి, సర్వే అధికారులు ఉన్నారు.



బోథ్‌లో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

పరిహారం త్వరగా అందేలా చూడాలి



ఈ సారి ఆరెకరాల్లో మొక్కజొన్న వేసిన. పంట చేతికందే సమయంలో కురిసిన వడగళ్ల వానకు దాదాపు ఐదెకరాల్లో దెబ్బతింది. చేసిన కష్టం వర్షార్పణమే అయింది. ఇప్పటికీ అధికారులు వచ్చి చూడలే. పంట నష్టం సర్వే త్వరగా పూర్తి చేసి పరిహారం అందించాలని కోరుతున్నాం.
– సంజీవ్, రైతు, కనుగుట్ట

33 శాతం నిబంధన ఎత్తివేయాలి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో కొనసాగించాలి. అలాగే రైతులు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం త్వరగా పరిహారం అందించి ఆదుకోవాలి. 33 శాతం దెబ్బతింటేనే సర్వే చేస్తామంటున్న ప్రభుత్వ నిర్ణయం సరికాదు. గుంట నష్టపోయినా పరిహారం అందించాలి. – కట్ల భూమేశ్, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి

పంట నష్టపోయిన రైతుల వివరాలు అందించాలి



టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్

కైలాస్‌నగర్: అకాల వర్షాలు, వడగళ్లతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతుల పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో హైదరాబాద్ నుంచి బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగళ్లతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పరిహారం నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించాలన్నారు. వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు మాట్లాడుతూ 33 శాతం మించి నష్టపోయిన రైతుల పంటలకు మాత్రమే పరిహారం అందించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో బోథ్, నేరడిగొండ మండలాల్లో 2,385 ఎకరాల్లో మొక్కజొన్న, జొన్న, గోధుమ, నువ్వులు, కొత్తిమీర, మిర్చి పంటలకు నష్టం జరిగిందన్నారు. ఆయా పంటల క్షేత్ర పరిశీలన, రైతుల బ్యాంకు ఖాతాలు, పూర్తి సమాచారాన్ని నిర్ణీత ప్రొఫార్మాలో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు రెండు, మూడు రోజుల్లో సేకరించాలని ఆదేశించినట్లు తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రైయినీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, సహాయ సంచాలకులు రమేశ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. పది పరీక్షల నిర్వహణపై రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ బుధవారం ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 10,699 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని, వీరి కోసం 54 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలీస్, ఆర్టీసీ, విద్యుత్, తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా బాధ్యతలను పంచాయతీలు, మున్సిపాలిటీకి అప్పగించామన్నారు. అలాగే పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ డి.ఉదయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు బందోబస్తు మధ్య ప్రశ్నపత్రాల మధ్య తరలింపు తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు ఎన్.నటరాజ్, రిజ్వాన్ బాషా షేక్, ట్రెయినీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీఈవో ప్రణీత, డీపీవో శ్రీనివాస్, పోలీస్, పోస్టల్, విద్యుత్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణకు వేళాయె



బేల మండలం కరోని శివారులో కల్లంలో సేకరించిన తునికాకు (ఫైల్)

- మొదలైన టెండర్ల ప్రక్రియ
- ఈ సారి కట్ట ధర 95 పైసలు పెంపు
- ఏప్రిల్ నెలాఖరు నుంచి ఆకు సేకరణ

కైలాస్‌నగర్: జిల్లాలో తునికాకు సేకరణపై అటవీశాఖ దృష్టి సారించింది. ఏటా మాదిరిగానే ఈ ఏడాది సైతం ఏప్రిల్ నెలాఖరులో ప్రారంభించాలని యోచిస్తోంది. ఈ మేరకు అధికారులు కసరత్తు షురూ చేశారు. కల్లాలను ఏర్పాటు చేసే కాంట్రాక్టర్ల ఎంపిక కోసం టెండర్ల ప్రక్రియ చేపడుతున్నారు. ఇప్పటికే కొన్ని యూనిట్లకు టెండర్ ఫైనల్ కాగా మరి కొన్నింటిని ఈ నెలాఖరు వరకు పూర్తిచేసేలా చర్యలు చేపట్టారు. టెండర్ల ప్రక్రియ జాప్యం కారణంగా అటవీ ప్రాంతాల్లో ఈ సారి కొమ్మకొట్టే కార్యక్రమాన్ని చేపట్టకుండానే తునికాకు సేకరించనున్నారు. మరోవైపు కూలీలకు లబ్ధి చేకూర్చడంతో పాటు లక్ష్యానికనుగుణంగా ఆకుసేకరణ జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 50 ఆకుల కట్టకిచ్చే ధరను 95 పైసలు పెంచింది. కట్టకు రూ.3 చెల్లించనుండటంతో ఈ సారి కూలీల సంఖ్య పెరగనుందనే అభిప్రాయాన్ని అటవీశాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా ఖరారు కాని లక్ష్యం
వేసవిలో అటవీ ప్రాంతాలను ఆనుకుని ఉండే గ్రామాల ప్రజలు తునికాకు సేకరణతో ఉపాధి పొందుతారు. వేకువజామునే ఇంటిల్లిపాది అటవీ ప్రాంతానికి వెళ్లి ఆకును సేకరించి తీసుకువస్తారు. దాన్ని కట్టలుగా కట్టి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కల్లాలకు వెళ్లి విక్రయిస్తారు. 15 నుంచి 20 రోజుల పాటు సాగే ఈ ప్రక్రియ ద్వారా ఆయా ప్రాంతాల్లోని కూలీలకు ఉపాధి లభిస్తుంది. మూడేళ్లుగా కూలీల సంఖ్యతో పాటు బీడీ ఆకు కట్టల సేకరణ కూడా పెరుగుతుంది. అయితే ఈ ఏడాది తునికాకు సేకరణ లక్ష్యాన్ని అటవీశాఖ ఇంకా ఖరారు చేయలేదు. ఎంత చేపట్టాలి, ఏ యూనిట్లలో చేపట్టాలనే దానిపై కూడా ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో కల్లాల ఏర్పాటుకు సైతం టెండర్లను ఇప్పుడిప్పుడే పిలుస్తుండటంతో ఏ ప్రాంతాల్లో తునికాకు సేకరిస్తారనే దానిపై కూడా స్పష్టత లేదు. జిల్లాలోని బేల, దస్నాపూర్, ఉట్నూర్, నార్నూర్ యూనిట్లలో తునికాకు సేకరణ ఎక్కువగా ఉంటుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నెలాఖరులోపు కల్లాల ఏర్పాటుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు పేర్కొంటున్నారు.

జిల్లాలో..	
అటవీ ప్రాంత విస్తీర్ణం	1,82,604.46 హెక్టార్లు
అటవీ రేంజ్‌లు	09
తునికాకు కల్లాలు	43
ఉపాధి పొందే కూలీలు	3,656

ఆకు కట్ట ధర పెంపు
తునికాకు సేకరణతో ఉపాధి పొందే కూలీలకు ఆర్థికంగా ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కట్ట ధరను ఈ సారి మరో 95పైసలు పెంచింది. గతేడాది 50 ఆకుల కట్టకు రూ.2.05 పైసలు చెల్లిస్తుండగా తాజాగా దీనిని రూ.3కు పెంచింది. అదనంగా బోనస్ సైతం చెల్లించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఫలితంగా ఈసారి కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు అటవీశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

కొనసాగుతున్న టెండర్ల ప్రక్రియ
తునికాకు కల్లాల నిర్వహణకు సంబంధించిన కాంట్రాక్టర్ల ఎంపిక కోసం టెండర్ల ప్రక్రియ కొనసాగుతుంది. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియను పూర్తి చేసి యూనిట్లతో పాటు ఆకు సేకరణ లక్ష్యాన్ని ఖరారు చేస్తాం. ఏప్రిల్ నెలాఖరులో ఆకు సేకరణ చేపడుతాం. అటవీ సంపద వృద్ధి చెందినందున తునికాకు చెట్ల సంఖ్య కూడా పెరిగింది. కట్ట ధరను సైతం ప్రభుత్వం పెంచింది. కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– పి.రాజశేఖర్, జిల్లా అటవీశాఖ అధికారి

ప్రత్యామ్నాయం

- కుంగిన తర్నం బ్రిడ్జికి బదులు లాండసాంగ్వి రహదారిపై దృష్టి
- డబుల్ రోడ్డుగా మార్చేలా రూపకల్పన
- రూ.40 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు



కుంగిపోయిన తర్నం బ్రిడ్జి ఇదే..



లాండసాంగ్వి మీదుగా వెళ్లే ప్రస్తుత సింగిల్ రోడ్డు దుస్థితి

సాక్షి,ఆదిలాబాద్: జాతీయ రహదారి 353 బి.. ఆదిలాబాద్ జిల్లాలో జైనథ్, బేల మీదుగా మహారాష్ట్రకు వెళ్లేందుకు అనువైన రోడ్డు. ఫిబ్రవరిలో ఈ రహదారి మధ్యలో జైనథ్ మండలంలోని తర్నం వద్ద బ్రిడ్జి కుంగిపోయిన విషయం తెలిసిందే. ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం మహారాష్ట్ర వైపు వెళ్లేందుకు ఆదిలాబాద్ మండలం లాండసాంగ్వి మీదుగా ఉన్న సింగిల్ రోడ్డును వాహనదారులు వినియోగిస్తున్నారు. రానున్న రోజుల్లో ఎన్‌హెచ్ 353బిని అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు అయినప్పటికీ ఆ రహదారి నిర్మాణం పూర్తయ్యేందుకు సమయం తీసుకునే అవకాశం ఉండడంతో ప్రత్యామ్నాయంగా లాండసాంగ్వి రహదారిని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

డబుల్ రోడ్డు ప్రతిపాదనలు..
ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చేరుకోవాలంటే జైనథ్ మండలంలోని భోరజ్ నుంచి తర్నం బ్రిడ్జి మీదుగా నిరాల, జైనథ్, బేల దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. అయితే బ్రిడ్జి కుంగిపోవడంతో ఆదిలాబాద్ నుంచి మరో మార్గంగా లాండసాంగ్వి, అర్లి, అడ, నిరాల మీదుగా ఉన్న సింగిల్ రోడ్డు మీదుగా భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ రోడ్డు ప్రస్తుతం పంచాయతీ రాజ్ ఆధీనంలో ఉంది. దీన్ని డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. పీఆర్ నుంచి ఎన్‌హెచ్ పరిధిలోకి అప్‌గ్రేడ్ చేయడం ద్వారా ఈ రహదారిని పూర్తి స్థాయిలో పటిష్టపరిచే విధంగా ఆలోచన చేస్తున్నారు. ఇందులో భాగంగా రూ.40 కోట్లతో కేంద్రానికి ఎన్‌హెచ్ అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

త్వరితగతిన సాధ్యమేనా..
353–బి జాతీయ రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే ప్రక్రియ ఇప్పటికే టెండర్ దశకు వచ్చింది. రూ.490 కోట్లతో ఈ రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. అయితే దీనికి సుమారు రెండేళ్ల వరకు సమయం పట్టే అవకాశం ఉండడంతో అంత వరకు ఈ రహదారిపై నుంచి వెళ్లే ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఏడాదిలోగా లాండసాంగ్వి రహదారిని అభివృద్ధి చేయాలని అధికారులు ప్రణాళిక చేశారు. అది ఎంత వరకు సాధ్యమవుతుందో వేచి చూడాల్సిందే.

ప్రతిపాదనలు పంపించాం..



తర్నం బ్రిడ్జి కుంగిపోవడంతో లాండసాంగ్వి రహదారిని మహారాష్ట్ర వైపు వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేసేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం సింగిల్ రోడ్డుగా ఉన్న దీన్ని 7 మీటర్లకు విస్తరించడం ద్వారా డబుల్ రోడ్డుగా మార్చాలని యోచన. ప్రతిపాదనలకు అంగీకారం తెలిపితే స్వల్ప వ్యవధిలోనే ఈ రహదారిని అభివృద్ధి చేయవచ్చు.
– సుభాష్, డీఈ (ఆర్అండ్‌బీ), ఎన్‌హెచ్ సబ్ డివిజన్, నిర్మల్

'నవమి'కి సర్వం సిద్ధం



విద్యుత్ కాంతులీనుతున్న ఓల్డ్ హౌసింగ్‌బోర్డ్‌లోని రామాలయం

శ్రీరామనవమి వేడుకలకు సర్వం సిద్ధమయ్యాయి. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీరామాలయం, శాంతినగర్ కాలనీలోని కోదండ రామాలయం, చాందాలోని శ్రీరామాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. రాంనగర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో తలంబ్రాల తయారీ కార్యక్రమం చేపట్టారు. నేడు శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం నుంచి శోభాయాత్ర నిర్వహించనున్నారు. – ఆదిలాబాద్

క్లుప్తంగా

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ శివారులోని పేకాట స్థావరంపై బుధవారం రాత్రి ఖానాపూర్ ఎస్సై ఆర్ శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురు పారిపోగా మరో ముగ్గురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.4500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.




గత వర్షాకాలంలో పొంగుతున్న వాగు



ప్రస్తుతం కంచెలతో కబ్జాలకు గురైన వాగు

వాగును మింగేశారు

ఆదిలాబాద్ పట్టణ పరిధిలో ఆక్రమణలు ఆగడం లేదు. భూబకాసురులు చెలగేరిపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, అసైన్డ్ అనే తేడా లేకుండా ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తున్నారు. తాజాగా పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డు నుంచి రాంనగర్ మీదుగా సుభాష్‌నగర్ వైపు ప్రవహించే వాగును కబ్జా చేసేశారు. అడ్డూఅదుపు లేకుండా ఆక్రమంగా హద్దులను ఏర్పాటు చేసుకుని వాగు ఆనవాళ్లు లేకుండా చేయడం గమనార్హం. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఫలం.. పోషకాలు పుష్కలం

- రోజా విరమణలో వినియోగం
- రంజాన్ మాసంలో ప్రత్యేకం

నెన్నెల(బెల్లంపల్లి): రంజాన్ మాసం వచ్చిందంటే పండ్లకు భలే గిరాకీ ఉంటుంది. ఇఫ్తార్ దీక్ష విరమణకు ముస్లింలు ఎక్కువగా పండ్లనే ఇష్టపడుతారు. ఎందుకంటే వాటిలో పోషకాలు అధికంగా ఉండడమే కారణం. సుమారు 15 గంటల పాటు ఉపవాసం ఉండి సాయంత్రం దీక్ష విరమణ సమయంలో పోషకాలు అధికంగా ఉండే ఫలాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు పేర్కొంటున్నారు. తాజా పండ్లతో పాటు డ్రై ఫ్రూట్స్ తీసుకోవాలని సూచిస్తున్నారు.

పోషకాల ఖర్జూర..

ఖర్జూరలో తక్షణ శక్తినిచ్చే పోషకాలు ఉంటాయి. మహ్మద్ ప్రవక్త రంజాన్ ఉపవాస దీక్ష విరమణ సమయంలో వీటినే ఎక్కువగా తీసుకునే వారు. చాలామంది సున్నత్(మహ్మద్ ప్రవక్త ఆచారం)లో భాగంగా ముందుగా ఖర్జూర పండ్లతోనే ఉపవాసదీక్షలు విరమిస్తారు. ఆ తర్వాతే ఇతర ఫలాలు తింటారు. ఈ క్రమంలో వాటి గిరాకీని తట్టుకునేందుకు



పోషకాలను ఇచ్చే పండ్లు

రంజాన్ మాసంలో వ్యాపారులు విదేశాల నుంచి కూడా మేలు రకమైన ఖర్జూరను దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. ఇందులో విటమిన్లు బీ–1, బీ–2, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం ఉంటాయి.

శక్తినిచ్చే ఎండుఫలం

ఎండుఫలాలు మంచి శక్తినిస్తాయి. సౌదీలో ఎండు ఫలాలు అధికంగా లభిస్తాయి. మహ్మద్ ప్రవక్త దీక్ష విరమణ కోసం ఎండుఫలాలైన ఖర్జూర, కాజు, బాదం, పిస్తా, అక్రోట్‌లను అధికంగా తినేవారని చరిత్ర చెబుతోంది. ఈ ఎండు ఫలాల్లో అధిక పోషకాలు ఉంటాయి. దీంతో ముస్లింలు రోజా విరమణ కోసం ఇఫ్తార్‌లో వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. తర్బూజ, కర్బూజ, బత్తాయి, ద్రాక్ష, సంత్రాలలో దాహం తీర్చే గుణాలు ఉంటాయి. విటమిన్లు, పీచు పదార్థాలు ఉంటాయి. అరటిలో విటమిన్–ఏ, కాల్షియం ఉంటాయని వైద్యులు పేర్కొంటున్నారు.

రోజా విరమణకు ఖర్జూర శ్రేష్టం



మహ్మద్ ప్రవక్త ఖర్జూర పండుతోనే రోజా విరమణ చేసే వారని ఖురాన్‌లో పేర్కొన్నారు. వీటిలో బీ–1, బీ–2, కాల్షియం, పోషక విలువలు మెండుగా ఉంటాయి. అందుకే వివిధ దేశాల్లో రోజు విరమణకు ముందుగా ఖర్జూరనే ఉపయోగిస్తారు.

– మహ్మద్ ఇబ్రహీం ఖాద్రి

డీహైడ్రేషన్ దూరం



రోజుకు సుమారు 15 గంటల పాటు అన్నపానియాలు ముట్టుకోకుండా కఠిన ఉపవాస దీక్ష ఉంటుంది. రోజా విరమణ సమయంలో పండ్లు తీసుకుంటే శక్తితో పాటు శరీరానికి కావాల్సిన నీటిశాతం అందుతుంది. ఇఫ్తార్‌లో పండ్లు తీసుకుంటే ఆహారం సులువుగా జీర్ణమవుతుంది. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు ఉపవాస దీక్ష విరమణకు పండ్లు తీసుకుంటారు.

– యూనిస్ రజాఖాద్రి హఫీజ్, బెల్లంపల్లి

లక్ష్య సాధనకు కృషి చేయాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి
- ఘనంగా జామ్డా ఆశ్రమ పాఠశాల గోల్డెన్ జూబ్లీ

నార్నూర్: పట్టుదలతో చదువుకుని ఉన్నత లక్ష్యసాధన కోసం విద్యార్థులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో వరుణ్ రెడ్డి అన్నారు. మండలంలోని జామ్డా బాలికల ఆశ్రమ పాఠశాల గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జ్యోతిప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ఎవరెస్ట్ శిఖరం అధిరోహిత మాలోత్ పూర్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థుల్లో విద్య నైపుణ్యం పెంచడానికి కార్యక్రమాలు చేపడుతూ వంద శాతం ఫలితాల సాధన కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు. తల్లిదండ్రులు చిన్నచిన్న పండుగలకు విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లి వారి విద్యకు



మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి

నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చదువు ఉంటేనే ఏదైనా సాధ్యమవుతుందని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల నైపుణ్యతను వెలికితీసి పోటీ ప్రపంచం ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అనంతరం ఎవరెస్టు శిఖరం అధిరోహిత మాలోత్ పూర్ణ మాట్లాడుతూ ఆడపిల్లలు భయపడకుండా ముందుకెళితే ఏదైనా సాధ్యమేనని తెలిపారు. ఒక లక్ష్యం పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదని సూచించారు. జీవితంలో ఆరోగ్యం, బాధ్యత, లక్ష్యం ఈ మూడు ఉంటే ఉన్నత శిఖరానికి చేరుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వక ఈడీ దాడులు సరికాదు

- సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై ఉద్దేశపూర్వకంగా ఈడీ దాడులతో పాటు వారిని వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురి చేయడం బీజేపీ ప్రభుత్వ హేయమైన రాజకీయాలకు నిదర్శనమని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందన్నారు. ప్రశ్నించే హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛ హక్కు రాజ్యాంగబద్ధమైనప్పటికీ బీజేపీ ప్రభుత్వం హరించి వేస్తుందన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి బీజేపీ హటావ్ భారత్‌తో బచావ్ నినాదంతో సీపీఐ పోరాటాలకు సిద్ధమవుతోందని వివరించారు. ఏప్రిల్ 14న మొదలైన ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం మే 14 వరకు కొనసాగనుందని, ఇందులో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలను కలుపుకుని ప్రజా సమస్యలపై పోరాడటం చేస్తామని తెలిపారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు ముడుపు నళినిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాములు, పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



షేక్ రహీం మృతదేహం

లోకేశ్వరం: పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... నగర్ గ్రామానికి చెందిన షేక్ రహీం (33) భార్య మౌలానితో నాలుగేళ్ల క్రితం విడాకులు తీసుకున్నాడు. అప్పటి నుంచి రహీం తాగుడుకు బానిసయ్యాడు. ఒంటరితనం భరించలేక మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి పడిపోవడంతో కుటుంబ సభ్యులు గమనించి 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. తమ్ముడు షేక్ జాఫర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా..

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–బాసర రహదారిపై బుధవారం వేకువజామున లారీ అదుపుతప్పి బోల్తాపడింది. భైంసాలోని కాటన్ జిన్నింగ్ మిల్లు నుంచి పత్తి బేళ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ స్థానిక హరియాలీ ఫంక్షన్‌హాల్ సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో లారీలో పత్తిబేళ్లు కింద పడిపోయాయి. డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. 161 బీబీ రహదారి పనుల్లో జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, పనులు జరుగుతున్న చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.